## కేంద్రం వెంటనే బీసీ కుల గణన చేపట్టాలి

**తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ గౌడ్**

హిమాయత్‌నగర్, జూన్ 30: బీసీ కులాల లెక్కలు తేలకపోవడంతో బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీసీల కుల గణన చేయకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందని, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను అమలు పర్చాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల జనగణన చేసి జనాభా దామాషా ప్రకారం, వారి అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు.

## ఓయూలో ల్యాండ్ స్కేపింగ్

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, రోడ్ల వెంబడి చెట్లను పెంచడం ద్వారా పచ్చదనాన్ని పెంచేందుకు హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం పనిచేస్తోంది. అందులో భాగంగా కోర్ సిటీలో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో సుమారు రూ. 86.92 లక్షలతో ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాంతాలను హెచ్‌ఎండీఏ అధికారులు యూనివర్సిటీకి వెళ్లి పరిశీలించి, ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని, త్వరలోనే ల్యాండ్ స్కేపింగ్ పనులు మొదలు పెడతామని అధికారులు తెలిపారు.

## విట్టెన్ బర్గ్ వర్శిటీలో స్పాట్ అడ్మిషన్లు

అమీర్‌పేట్, జూన్ 30: భారతీయ విద్యార్థుల విద్యావకాశాలను విస్తృతం చేస్తూ జూలై 3న యూఎస్‌కు చెందిన విట్టెన్ బర్గ్ వర్శిటీ స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనుంది. ప్రపంచ వ్యాప్తంగా డాటా సైన్స్ గ్రాడ్యుయేట్స్‌కు పెరుగుతున్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని విట్టెన్ బర్గ్ వర్శిటీ అనాలైటిక్స్‌లో ఎంఎస్ చేసేందుకు వీలైన కోర్సులను అందుబాటులోకి తేనుంది. ఇందుకు సంబంధించి జూలై 3న అమీర్‌పేట్‌లోని హోటల్ ఆదిత్యలో జరిగే ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో స్కాలర్‌షిప్‌లతో కూడిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని వర్శిటీ ప్రవేశాల విభాగం వైస్ ప్రెసిడెంట్ మారిబెత్ స్టీవెన్స్ తెలిపారు. అనాలైటిక్స్‌లో ఎంఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు మేనేజ్‌మెంట్, హెల్త్ కేర్, ఫైనాన్స్, మార్కెటింగ్, లాజిస్టిక్స్ తదితర విభాగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు మరిన్ని వివరాలకు www.wittenberg.edu. లో సంప్రదించాలని కోరారు.

## 'సమగ్ర సార్వత్రిక ధర్మం'పై వ్యాయామ అధ్యాపకులకు సెమినార్

జూబ్లీహిల్స్, జూన్ 30: 'సత్యశోధన – శక్తిసాధన' మార్గంతో ఆత్మన్యూనత, బలహీనతలను అధిగమించవచ్చని ప్రముఖ పారిశ్రామిక, ఆధ్యాత్మికవేత్త, గీతావధాని డాక్టర్ యడ్లపల్లి మోహన్ రావు పేర్కొన్నారు. నగరంలోని హబ్సిగూడలో 'మానవత్వాన్ని మేల్కొలపడం, సమగ్ర పరచడం సార్వత్రిక ధర్మం,' అన్న అంశంపై వ్యాయామ అధ్యాపకులకు ఆదివారం సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ముస్తాక్ అహ్మద్ అభిలాష్, ఉస్మానియా వ్యాయామ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ప్రొ.కె. దీప్‌ల, డాక్టర్ ఏ.మాలరాజు, డాక్టర్ సీసా, జిలానీ పాల్గొన్నారు.


## నగరంలో వాన



నగరంలో ఆదివారం పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాలలో జనం ఇబ్బందులకు గురయ్యారు. వ్యాపార లావాదేవీలకు అవాంతరాలు ఎదురయ్యాయి.

# గ్రీన్ జోన్‌ను రెసిడెన్షియల్‌గా మార్పిస్తా..

- ఎన్నికల ముందు కాలనీ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుతా
- కాలనీవాసులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, రామిడి రాంరెడ్డి, గ్రీన్ జోన్ కాలనీల అసోసియేషన్ నాయకులు

బడంగ్‌పేట, జూన్ 30: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లో ఉన్న గ్రీన్ జోన్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అల్మాస్‌గూడలోని 24వ డివిజన్‌లో ఉన్న విశాఖనగర్, శ్రీసాయి హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ఎస్ఆర్ హిల్స్, ఏఆర్ఎస్ఆర్ కాలనీ అసోసియేషన్ నాయకులు గ్రీన్ జోన్ నుంచి తమ కాలనీలను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నం. 122, 123, 124, 129లో ఉన్న గ్రీన్ జోన్ ఎత్తివేస్తే కాలనీ వాసులు ప్రశాంతంగా ఉంటారని ఎమ్మెల్యేకు వివరించారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు రాక ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్ జోన్ పరిధి ఉందన్నారు. ఒక అల్మాస్‌గూడలోనే ఆరు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి అనుమతులు ఇవ్వక పోవడంతో బ్యాంకర్లు లోన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ బ్యాంకుల నుంచి లోన్ తీసుకుంటే నెలకు అదనంగా 11 వేలు చెల్లించవలసి వస్తుందని ఎమ్మెల్యేకు తెలిపారు. అందుకు గాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేయించే బాధ్యత తీసుకుంటానని ఆమె పేర్కొన్నారు. గతంలోనే ఈ సమస్య పరిష్కారం కావలసి ఉందన్నారు. చిన్న చిన్న సమస్యల వలన పెండింగ్ అయ్యిందన్నారు. దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్న అంశం తన దృష్టిలోకి వచ్చిందన్నారు. బడంగ్‌పేట, అల్మాస్‌గూడలో ఉన్న ఈ సమస్యను అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకపోయి పరిష్కరిస్తానని కాలనీవాసులకు అభయం ఇచ్చారు. కాలనీలలో మౌలిక సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఆమె తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, నవారు మల్లారెడ్డి, గ్రీన్ జోన్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్, మాధవరెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

## మీ సేవ కేంద్రాలపై నీలి నీడలు

- మహిళా శక్తి కేంద్రాలకు కేటాయిస్తే కుదేలే..!
- డిజిటల్ సేవల ప్రభావంతో తగ్గిన మీ సేవ కేంద్రాల ప్రభ




జూబ్లీహిల్స్, జూన్ 30: పౌర సేవలకు నెలవైన మీ సేవ కేంద్రాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనుంది. 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరిట కాంట్రాక్టర్లకు బదులుగా సర్కారు బడుల్లో సివిల్ పనుల నిర్వహణ బాధ్యతలు పొదుపు సంఘాలకు కట్టబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మీ సేవ కేంద్రాలను మహిళా శక్తి కేంద్రాలకు కేటాయించేందుకు పావులు కదుపుతున్న విషయం తెలిసిందే. పౌర సేవలు డిజిటలైజేషన్ కాక ముందు, ఆధార్ కార్డులు కొత్తగా వస్తున్న సమయంలో మీ సేవ కేంద్రాల హవాయే వేరు. దీంతో ఆ కాలంలో మీ సేవ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటివరకు 4800 మీ సేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. డిజిటల్ సేవల ప్రభావంతో స్వీయ పౌర సేవల వినియోగ విస్తృతి పెరిగి మీ సేవ కేంద్రాల ప్రభ తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో నెలకు రూ.3 నుంచి 4 వేల కమీషన్ కూడా రాని కేంద్రాలే 3 వేలకు పైగా ఉన్నాయని అంచనా. దీంతో కనీసం ఇద్దరు ఆపరేటర్లతో జోడెద్దుల బండిలాగా మీ సేవ కేంద్రాలను గుంజుకొస్తున్న నిర్వాహకులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా శక్తి కేంద్రాలకు రెండు, మూడు లక్షల రూపాయల రుణ సౌకర్యం కల్పించి, అన్ని జిల్లాలలో 936 మీ సేవ కేంద్రాలను, గ్రేటర్‌లో కనీసం 150 కేంద్రాలను నెలకొల్పాలని యోచిస్తున్నట్లు సమాచారం. మీ సేవ కేంద్రాలలో ఇద్దరు ఆపరేటర్లకే జీతాలు ఇవ్వలేక కిందా మీద పడుతున్న మీ సేవ నిర్వాహకులు కొత్తగా మహిళా మీ సేవ కేంద్రాలు వస్తే తమకు వచ్చే ఆ కొద్ది కమీషన్‌కు గండి పడుతుందని భావిస్తున్నారు. అంతే కాక ఇది రుణ సహాయం పొంది వడ్డీతో బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సిన మహిళల ఆర్థిక అభ్యున్నతికి గొడ్డలిపెట్టుగా మారి వారిని మరింత అప్పుల్లోకి నెట్టేలా చేస్తున్నదని భావిస్తున్నారు. దీంతో రెంటికి చెడ్డ రేవడిలా ఇద్దరిలో ఎవరు బాగుపడకుండా ఇద్దరు కుదేలైపోయే పరిస్థితి నెలకొననున్నది. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న మీ సేవ కేంద్రాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం ఎంత మాత్రం సహేతుకం కాదని మీ సేవ నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవా సెంటర్ల ప్రతినిధులు శనివారం బంజారాహిల్స్‌లోని ఈఎస్‌డీ (మీ సేవ) కమిషనర్ టి.రవి కిరణ్, ఐఏఎస్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వినతిపత్రం కూడా ఇచ్చిన ప్రతినిధులు దీనిపై పోరాటం చేయకతప్పదన్నారు.

## పేషెంట్ల శ్రేయస్సుకు కట్టుబడిన స్టార్ హాస్పిటల్స్

**విజయవంతంగా స్టార్ ఆర్థో 360 వాకథాన్-24**




స్టార్ ఆర్థో 360 వాకథాన్–24ను ప్రారంభిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

జూబ్లీహిల్స్, జూన్ 30: స్టార్ హాస్పిటల్స్ తెలంగాణ, ఏపీలలో అతి పెద్ద జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్థోపెడిక్ పోస్ట్–సర్జరీ పేషెంట్ వాకథాన్‌ను ఆదివారం స్టార్ ఆర్థో 360 వాకథాన్–24 పేరిట నిర్వహించింది. ఈ మేరకు 16 నెలల వ్యవధిలో వెయ్యికి పైగా చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినందుకు నగరంలోని నానక్‌రామ్‌గూడలో వేడుకలను ఘనంగా నిర్వహించి పేషెంట్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. వాకథాన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, స్టార్ హాస్పిటల్ పేషెంట్ల సమగ్ర ఆరోగ్యం, శ్రేయస్సుకు కట్టుబడి పనిచేయడం అభినందనీయమని, ఇందులో ప్రత్యేకంగా ఎముకలు, కీళ్ళ ఆరోగ్యాన్ని కాపాడటంలో చురుకైన పాత్ర పోషిస్తుందన్నారు. అవగాహన సదస్సులో స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం మాట్లాడుతూ, మన జీవన నాణ్యతను పెంపొందించుకునేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమన్నారు. కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ స్పెషలిస్ట్‌లు డాక్టర్ వేద ప్రకాశ్, డాక్టర్ శశికాంత్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జల సంరక్షణను ఉద్యమంగా చేపట్టాలి



దుర్గంచెరువు వద్ద 5కే వాక్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి

కొండాపూర్, జూన్ 30: జల సంరక్షణను ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు సమీపంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని 'ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్' ఆధ్వర్యంలో ఆదివారం 5కే వాక్‌ను నిర్వహించారు. ఇందుకు డా.సతీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఖాదీ బోర్డు సభ్యులు పేరాల శేఖర్ రావు, సింగరేణి సీఎండీ బలరామ్, ఐఎంఏ నూతన అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డిలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని, ప్రతి చుక్క వాన నీటిని ఒడిసి పట్టడాన్ని ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. జల సంరక్షణతోనే భూగర్భ జలాల పెంపు సాధ్యమవుతుందన్నారు. జల వనరుల సంరక్షణలో భాగంగా చెరువులు, కుంటలు, నదుల సంరక్షణకు కృషి చేయాలని, నదులు లేకపోతే నాగరికత ఉందని, పర్యావరణ సమస్యలను అత్యంత ప్రాధాన్యత గల అంశాలుగా గుర్తించాలన్నారు. పర్యావరణం దెబ్బతినడం కారణంగానే అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. వాక్‌లో 200లకు పైగా వైద్యులు పాల్గొని 5కే నడిచారు. అనంతరం వాక్‌లో పాల్గొన్న వారిని మెడల్స్‌తో సత్కరించారు.

## మెడికవర్ దవాఖానలో ఉమెన్స్ ఆంకాలజీ గ్లోబల్ సమ్మిట్



ఉమెన్స్ ఆంకాలజీ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న వైద్య బృందం

కొండాపూర్, జూన్ 30: స్త్రీ జననేంద్రియ, రొమ్ము క్యాన్సర్, చికిత్స విధానాలపై అవగాహన కల్పించేందుకు హైటెక్ సిటీలోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 'ఉమెన్స్ ఆంకాలజీ'పై ఆదివారం గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ రవిచందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సమ్మిట్‌ను ప్రారంభించారు. సదస్సులో భాగంగా మహిళలు ఎదుర్కొనే ఎండోమెట్రియల్, గర్భాశయ, రొమ్ము, అండాశయ క్యాన్సర్‌లపై ఆంకాలజీ నిపుణులు చర్చించారు. క్యాన్సర్ నివారణలో తాజా పరిశోధన ఫలితాలు, వినూత్న చికిత్స పద్ధతులు, ఉత్తమ అభ్యాసాలతో లోతుగా నిమగ్నమైన అంశాలను నిపుణులు తమ సలహాలు, సూచనలను పంచుకున్నారు. కార్యక్రమంలో వివిధ దవాఖానల నుంచి విచ్చేసిన 200 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

## 21న అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలు




బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 30:షావోలిన్ టైగర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఇండియన్ ఆల్ స్టయిల్ కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ వ్యవస్థాపకులు మద్ది కన్నన్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్, సినీ నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. వివిధ కేటగిరిలలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలను అందజేస్తామన్నారు.

# బోనాల్లో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలి

- ఉత్సవాలకు వచ్చే భక్తులు అసౌకర్యానికి కలగకుండా చూడాలి
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, జూన్ 30: ఆషాఢ మాసం అంటేనే బోనాల ఉత్సవాలకు పెట్టింది పేరని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గం పరిధి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణం, సికింద్రాబాద్ బోనాలు – జాతరను అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా జూలై 9న జరిగే బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణం, 21, 22న జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదే విధంగా అధికారులకు పరస్పర సహకారం అందిస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అనేక అభివృద్ధి పనులను చేపట్టకుండా ప్రజా సమస్యల పట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పనులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆషాఢ మాసం అనంతరం, పాదయాత్రకు రూపకల్పన చేస్తామని తెలిపారు. సమస్యలపై ప్రజా క్షేత్రంలో పోరాడుదామని పిలుపునిచ్చారు.

**తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు...**

తన సోదరుడు శంకర్ యాదవ్ మరణ విషాదం నుంచి తాము ఇంకా కోలుకోలేదని తలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. శంకర్ యాదవ్‌తో తనకున్న ప్రత్యేక బంధం సికింద్రాబాద్ ప్రజలందరికి తెలిసిందేనన్నారు. తన కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉన్నదని ఆ కారణంగానే రాజకీయ పరమైన కార్యకలాపాలలో పాల్గొనలేక పోతున్నట్టు వివరించారు. కానీ, తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అయోమయానికి గురి కావొద్దని కోరారు. ఈ క్రమంలో శంకర్ యాదవ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, కొలను లక్ష్మి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషు కుమారి, డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేశం రాజు, లక్ష్మీపతి, ఏసూరి మహేశ్, గులాబ్ సింగ్, ప్రేమ్ కుమార్, కిశోర్ కుమార్, ఆంజనేయులు, అఖిల్, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## సంచార జాతుల హామీలను అమలు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెద్దు నరేందర్

చిక్కడపల్లి, జూన్ 30: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో సంచార జాతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ డిమాండ్ చేశారు. సంచార జాతులు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఇస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన సంఘం నాయకులు అడ్వకేట్ అబ్బులింగం, ముగ్గు వీరయ్యలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యయన కమిటీ రాష్ట్ర చైర్మన్ వెంకట నారాయణ, వైస్ చైర్మన్ పి.సమ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నెల నాగరాజు, యూత్ అధ్యక్షుడు యువరాజ్, సావిత్రి, కోట అనిత, కోనేరు శ్రీనివాస్, పొన్నాల కుమార్, శ్యామ యాదగిరి, కంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బోట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న బోట్స్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్‌రావు

సిటీబ్యూరో, జూన్ 30(నమస్తే తెలంగాణ): 'ది బోట్స్ క్లబ్ హైదరాబాద్' వారి ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్సీ, బోట్స్ క్లబ్ అధ్యక్షులు చెన్నాడి సుధాకర్ రావు తెలిపారు. బోట్స్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొత్త కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా విద్య, వైద్య రంగాలలో ప్రజలను చైతన్యం చేయడంతో పాటు మురికివాడల్లో క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధికి నోచుకోని కాలనీలు, ప్రాంతాలను ఎంపిక చేసి వాటి అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు. కరోనా, తుఫాన్ సమయాల్లో రూ.20 లక్షల సహాయాన్ని అందించామన్నారు. క్లబ్ సభ్యుల కోసం ఆరోగ్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల క్లబ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నామని, తద్వారా వివిధ రాష్ట్రాల్లోని 59 క్లబ్బులలో సభ్యులు వివిధ సౌకర్యాలను పొందవచ్చన్నారు.

**నూతన కార్యవర్గం..**

హైదరాబాద్ బోట్స్ క్లబ్ అధ్యక్షులుగా చెన్నాడి సుధాకర్ రావు, ఉపాధ్యక్షులుగా ఏ.మురళీధర్ రెడ్డి, కార్యదర్శిగా టి.అమరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా బి.నరేందర్ రావు, కోశాధికారిగా కె.ధరణీధర్, సభ్యులుగా హెచ్‌వీ సురేందర్ నాథ్, సోమ విజయ్ ప్రకాశ్, శేషగిరి రావు, శ్రీధర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, విజయ్ గోపాల్ రావులను ఎన్నుకున్నారు.

## 6న పరవస్తు ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

జూబ్లీహిల్స్, జూన్ 30: ఈ నెల 6వ తేదీన సికింద్రాబాద్‌లోని బోయిగూడ గుజరాతీ భవన్‌లో పరవస్తు క్రియేటివ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీ, బీపీఓ, ఫార్మా, ఇతర కంపెనీలలో 4000 ఉద్యోగాల భర్తీకి మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రామ్‌కీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్ ల్యాండ్స్)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 50 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్, యూ ట్యూబ్ ఛానల్స్‌లో చూడవచ్చని తెలిపారు.

# త్వరలో మహిళా శక్తి క్యాంటీన్లు

**జిల్లాలో 20 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు**



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు

మేడ్చల్, జూన్ 30(నమస్తే తెలంగాణ): మహిళల ఆర్థికాభివృద్ధికి త్వరలోనే మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. మహిళలు అన్ని వ్యాపారాలలో రాణించేలా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు తీసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు మహిళా శక్తి పేరిట మహిళా క్యాంటీన్లను పెట్టించాలని చూస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 20 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు రూపొందించారు. రూరల్ ప్రాంతాలతో పాటు జిల్లాలో ఉన్న 13 మున్సిపాలిటీలలో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేసేలా చూస్తున్నారు. ఇప్పటికే మహిళ స్వయం సహాయక సంఘాల క్యాంటీన్ల ఏర్పాటుపై ఉత్సాహం ఉన్న మహిళా సంఘాలు ముందుకు రావాలని అధికారులు సమాచారం ఇచ్చారు. వ్యాపారాలలో ఆర్థికంగా అభివృద్ధి సాధించి ఉన్న మహిళా సంఘాలను ఎంపిక చేసి క్యాంటీన్లను పెట్టించాలనే ఉద్దేశంతో అధికారులు ఉన్నారు.

**అర్హత మేరకు క్యాంటీన్లకు రుణాలు..**

మహిళా సంఘాల అర్హత మేరకు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ రుణాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటుంది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో జీహెచ్‌ఎంసీ, గ్రామీణ ప్రాంతాలలో 3,401 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 36,802 మంది సభ్యులు ఉన్నారు. అయితే, మహిళా సంఘాల అర్హత మేరకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందించేలా బ్యాంకులకు సిఫారసును గ్రామీణాభివృద్ధి శాఖ చేస్తుంది. బ్యాంకు రుణాలు మంజూరు తర్వాత మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వాహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో గ్రామీణ ప్రాంతంలోని నాలుగు మండలాలలో ఈ క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇప్పటికే మహిళా సంఘాలు కుట్టు కేంద్రాలు, అల్లికలు, మీ సేవా కేంద్రాలు, ఫౌల్ట్రీ, పాల కేంద్రాలు, తదితర వ్యాపారాలను నిర్వహించుకుంటున్నాయి. మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. మొదట నాలుగు ప్రాంతాలలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు అర్హులైన మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేస్తాం. క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి సాంబశివరావు పేర్కొన్నారు.




ఆదివారం బస్సులు రాక గంటల తరబడి వేచి చూసిన ప్రయాణికులు నిరాశకు గురయ్యారు. చివరికి వచ్చిన ఒక బస్సు 'ఎడారిలో ఒయాసిస్సులా..' తోచింది. దీంతో ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు ఒక్కసారిగా ఎగబడ్డారు. ఈ దృశ్యం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద కనిపించింది.